కథా నిలయం
శ్రీకాకుళం

# నేనూ - నాత్యాగం

ఈ సాయంత్రం కథరాయాలని కూర్చుంటే ఎన్నో సంగతులు గుర్తుకొస్తున్నాయి. చుట్టుప్రక్కల ఎక్కడా ప్రకృతిసౌందర్యం లేదు. మనసుకు ఉల్లాసంకలిగించే వాతావరణంలేదు. ఇలాంటి సమయాన కథరాయటానికి తలపెడితే అన్నీ చెప్పకూడని నిజాలే. అన్నీ నిరాశతోకూడిన భావాలే.

కాని రాయాలి. ఎవరిని గురించి? దేన్నిగురించి? కొంతకాలం రాశాక చెయ్యి తిరుగుతుందంటారు, ఇంతకన్న పెద్ద అబద్ధం మరొకటిలేదు. కాలంగడుస్తున్నకొద్దీ, అనుభవం పెరిగినకొద్దీ ఆవేదన అధికమౌతుంది. దీనికి ఒక దారా? తెన్నా? ఇవి పలికించేందుకు పదాలేవి? నన్నుగురించి నేను రాసుకోవటమే చేతకాకపోతే యింక లోకాన్నిగురించి ఏం రాసేది? నన్నుగురించి నాకు రాసుకోవటానికే పరిధి చాలకపోతే యింక యితరుల గురించి రాయటానికి జాగా ఏదీ?

జీవితం ముందుకు పరిగెడుతోంది. మనిషిని - దాంతో పరుగు అందుకోలేకుండా వున్నాను. మరి భావాలు తబ్బిబ్బుపడక ఏం చేస్తవి?ఒకదానిమీద ఒకటి విరుచుకు పడటం వినా గత్యంతరం ఏమిటి?

ప్రతికథలోనూ నేను కనిపిస్తున్నానని మిత్రులంటున్నారు. అది పూర్తిగా నేనుకాదని నా కొక్కడికే తెలుసు. కొంచెం పేరు వచ్చింది. కొందరు వుత్తరాలు రాస్తున్నారు. కాని ఆ భావాల్లో నేను పూర్తిగా లీనంకావటంలేదని వాళ్ళకు ఎలా చెప్పను? అలా చెప్పటంకంటె రచన ఆపుచేయటం మంచిది. వాళ్ళకు నచ్చని రచనలు చేశానన్న అపఖ్యాతినుండి తప్పించుకుని, నామర్యాద నేను కాపాడుకున్నవాడ్నవుతాను.

విషాదంగావుంది.ఆలోచన్లు పాడుగా వున్నాయి.వాతావణం బాగా లేదని చెప్పనుగా.

నువ్వు పైకిరాదలిస్తే రెండేమార్గాలు: నీ కేదశలో మంచి పేరొచ్చిందో, ఆ దశనుంచి ముందుకి, లోతుకు పురోగమించడానికి ఏమాత్రం ప్రయత్నించకు. నువ్వు అంతకన్నా పెరగనట్లుగానే వుండు; లేదా నీలోమార్పులు వస్తున్నట్లు ఎవరికీ తెలియనివ్వకు. నీలోనే నువ్వు దాక్కో.

పాఠక మహాశయులు పొరపడవద్దు. ఇదికథే. వ్యాసమూ కాదు, నీతిసూత్రాల పట్టికాకాదు. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే మీతో ముఖాముఖి రావాలనివుంది. అదే యీ తాపత్రయం.

రచయిత చిరకాలం బ్రతకాలంటే ఒకస్థితిలోకివచ్చాక రక్కున రాయటం ఆపేయటం మంచిది.లేకపోతే యీవెటకారం నీ వెనుకటి "మంచిని"కూడా కొల్లగొడుతుంది.

జీవితం పాడయింది. ఎక్కడో వుండవలసినవాడ్ని ఎక్కడో వున్నాను. ఇంకా నాకు ఏదో సాధించాలనీ, ఏదో అనిపించుకోవాలని కాంక్ష ఎందుకు?

నేను చదువు మానేసేస్తాననే అంటున్నాను.కాని అమ్మే వొప్పుకోవటంలేదు. స్నేహితులు తందానాతందాపాడుతున్నారు. "ఈసారిత్రై చెయ్యి. ఈసారి ప్రైవేటు చెయ్యి" అంటున్నారు. ఇది ప్యాసయితే మాంచి వుద్యోగం యిప్పిస్తాననిమామయ్యభరోసా

యిస్తున్నాడు. ఇంతాచేస్తే ఐ. ఎ. ఎస్ లాంటిదేంకాదు.బి.ఎల్! నేను ఎంత చదివినా ప్యాసుకాందే ఏంచెయ్యను? తడవ తడవకూ "పరీక్ష ఫీజుకూ, మద్రాసుకు రైలుఖర్చులతో బోలెడు డబ్బు అయిపోతోంది. పోనీ,నేను లక్షాధికారినీ - సరదాకోసం చదువుతున్నాను అనుకుంటే ఏనెల కానెల ఏదోవస్తువు తాకట్టు పెట్టుతూనే వుంటిమాయె.చదువుమానేసి ఏదో వుద్యోగం చూసుకుంటానన్న నామొర వినే నాధుడెవరూ కనిపించటంలేదు. నేను ఎంత చదివినా ఈ పరీక్ష ప్యాసుకాను. ఈ విషయం నాకంటె ఎవరికీ ఎక్కువ తెలియదు.

అమ్మ యింట్లోలేదు. దేవాలయానికి వెళ్ళింది. నేనుకూర్చుని ఆలోచిస్తూ సతమత మవుతున్నాను — చదువుగురించి కాక, మిగతా విషయాలగురించి.

బల్లమీద కాయితాలు, చేతిలో కలం.

చెడిపోయినవాడు చెడిపోయినవాడుగా కనిపించటంలేదు.మంచివాడు మంచివాడుగా కనిపించటంలేదు, త్యాగం త్యాగంగా కనిపించదు. వింత వింతలా కానరాదు.

అలాఅని చరిత్రహీనులకు చరిత్ర కలిగిస్తాననీ, చెడిపోయినవాళ్ళ మనస్తత్వాన్ని సమర్థిస్తూ రాస్తాననీ బడాయిలు చెప్పుకోవటంలేదు. చెడిపోవటంలోనూ, మంచితనంలోనూ, త్యాగాల్లోనూగల సహజత్వంపట్ల మనసుకు నమ్మిక కలగటంలేదు. వీటన్నిటిలోనూ మనకు తెలియనిదేఖిటో వుండటంమాత్రమే కాదు; స్వార్థం, అస్పష్టతకూడా వున్నాయి.

"ఏమండీ?"

తలఎత్తి చూచాను. గుమ్మంలో యిరవయేళ్ళఅమ్మాయి నిలబడివుంది. విశాలనేత్రాలతో జాలిగాచూస్తోంది. రెండడుగులు లోపలకు వచ్చింది.

ఒక్క క్షణం ఏమిచేయటానికీ పాలుపోలేదు. ఎదురుగా ఒకకుర్చీ వుంది కూర్చో మన్నాను.

"వద్దండీ, నిలబడతాను."

"మీరు నిల్చోవటంవల్ల నాకు అధికంగా వచ్చేగౌరవం ఏమీలేదు"

సిగ్గుపడి కూర్చుంది. "అమ్మగారు లేరా?" అంది.

"లేదు. ఆమెతో పనివుందా?"

"మీదయ, ఆలకిస్తే మీతోనే మనవి చేసుకుంటాను"

"మనవిచేసుకోవద్దుగాని చెప్పండి"

ఆమె సిగ్గుతోనవ్వి చెప్పబోయింది. ఏం చెబుతుంది? గొంతు స్వాధీనంకాలేదు. నేను సానుభూతితో వారించాను.

ఈ అమ్మాయి నాకేం క్రొత్తదికాదు, అయిదారుకంవత్సరాల నుంచి అప్పుడప్పుడూ కనబడుతూనేవుంది. స్కూల్ ఫైనలు చదువుకునేప్పుడుగావును మొదటిసారిగా తల్లితో వచ్చింది. అప్పుడు నాన్నగారు వున్నారు. ఆమెతల్లి ఆయన కాళ్ళవేళ్ళా బడి కన్నీళ్ళతో మొరబెట్టుకుంది, నాన్నహృదయం కరిగి కొంతడబ్బు యిచ్చి పంపేశారు. చదువుకోవాలన్న తాపత్రయం, ఆత్రుత. తండ్రిచేసినతప్పుకు కూతురు శిక్షననుభవిస్తోంది. ఆయింటా, ఆయింటా అడుక్కుంటోంది.

అడుక్కుంటూనే యింటరులోకివచ్చింది. బి. ఏ. ప్యాస యింది, ఇప్పుడు ఎం. ఎ. కి కూర్చోబోతోంది.

"నిస్సహాయుడ్ని" అని నవ్వాను.

"బి. ఏ. ప్యాసవగానే ఉద్యోగంలో చేరాల్సింది" అన్నాను.

"పోనీ, రేపటినుంచి ప్రయత్నిస్తానులెండి" అంది.

"అదేం?"

"అదే, ఉద్యోగంచూసిపెట్టటానికి మీ రేమైనా సహాయం చేస్తా రేమోననివచ్చాను, అమ్మ మంచానఉంది. ఈవిషయమే మిమ్మల్ని

అడిగిరమ్మంది. అదికాదండీ. ఎవరుమట్టుకు ఎంతని యిస్తారు? పరీక్షకు రేపే ఫీజు కట్టటానికి ఆఖరిరోజు. చిల్లిగవ్వకూడా పోగుపడలేదు. రేపటిలోగా అంతడబ్బు ఎక్కడినుంచితేగలను? ఎందుకండీ నాకింకా యీ ఆశ? ఇంతే ప్రాప్త మనుకుంటాను"

"మరి యింతకాలం చదివి పరీక్షముందు మానేస్తారా?"

"ఏంచెయ్యను లేకపోతే?"

అవికళ్ళు, అవి కన్నీళ్ళు, అవి కన్నీటిచారలు.

నాకు తెలుసు, ఈమె రేపు ఫీజు కట్టగలిగితే మంచిమార్కులతో ప్యాసు అవుతుందని. తల్లి జబ్బుతోవున్నా, యింట్లోపనంతా తానే చూసుకోవలసివచ్చినా ఆమె పరీక్షతప్పదు!

"ఎమ్. ఏ, ప్యాసు అయాక ఏం చేస్తారు?" అన్నాను.

కాలేజి లెక్చరర్‌గానో, యింకా ఎందులోనో మంచివుద్యోగం వస్తుందని ఆశ."

చూశాను--ఈమె పెళ్ళిచేసుకుంటే జీవితం ఏవిధంగా వుండేదీ, డబ్బువుంటే ఏవిధంగా వుండేది, ఆ అమాయకత్వంలేకపోతే ఏవిధంగావుండేదీ-ఒక్క నిమిషం ఆలోచించాను. లేచి లోపలకు పెళ్ళి బీరువాతెరచి, ఒక కవరులోవున్నడబ్బును కవరు పళంగా పట్టుకునివచ్చి ఆమె చేతిలో వుంచాను."

"ఏమిటి?" అంది విస్మయంగా.

"మీకు సహాయపడేది?"

"ఏమిటి?" అంది మళ్ళీ వింతగా.

"నాకు సహాయపడనిది."

కవరు తెరచి, "లెక్కచూసి అమ్మో ఇంత డబ్బా?" అంది.

"అవును, పరీక్షఫీజు కట్టడానికి."

"ఇండడబ్బు మీరు ఒక్కళ్ళూనా?"

"అవును"

"అమ్మగారికి తెలుసా?"

"తెలియక్కరలేదు."

"కొప్పడరా?"

"ఆడబ్బు నేను బి. యల్. పరీక్షకు కడదామని అట్టేపెట్టుకున్నాను. అమ్మకా వివరాలన్నీ తెలిసే అవకాశం లేదు. కట్టానని చెపుతాను. పరీక్షకు వెళ్ళను.

"నాగురించి మీరు పరీక్ష మానుకుంటున్నారా? వద్దండి. అంత పనిచెయ్యవద్దు" అంటూడబ్బు బల్లమీద పెట్టి లేచి నిలబడింది.

"మీగురించి కాదు నాగురించే."

"ఎలా?"

"అది అంతే."

వివరాలన్నీ ఎందుకు? ఆమె చాలాసేపు ప్రాధేయపడింది. నేను నా పట్టుదల మానుకోలేదు. వేడుకుంది. వినలేదు. తలఎత్తి అశ్రువులు నిండిన కళ్ళతోనావంక చూసింది. చప్పున క్రిందకు వంగి భక్తితో నాపాదాలను స్పృశించింది.

ఈ వయసులోవున్న యువతీ యువకులకు మధ్య యిలాటి దెప్పుడూ జరగదు. ఇదేమిటి అని కంగారుగా కాళ్ళు వెనక్కిలాక్కున్నాను.

ఎన్నిసార్లో మళ్ళీకృతజ్ఞతలుచెప్పుకొని తలవంచుకొని అక్కడినుంచి వెళ్ళిపోయింది. బహూశా నా యీత్యాగాన్నిగురించి మనసులో బహుముఖాల స్తుతించుకుంటూ వుంటుందికాబోలు!

"త్యాగం! నాదీ త్యాగమేనా?" అని ప్రశ్నించుకున్నాను.

కాదు, కాని చాలాభాగం త్యాగాలు మట్టుకు యిలానేవుంటాయి. ఎవరి కేం తెలుసు-ఈపని ఒకవిధంగా నాభాద్యత తప్పించిదని, శ్రమతప్పిందనీ, ఒక అనవసర పరిశ్రమనుంచి నేను రక్షించబడ్డాననీ.